క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత

బోథ్: మండల కేంద్రానికి చెందిన గుండోజీ రాజ్‌కుమార్‌కు ఇటీవల నిర్మల్‌లో సెల్‌ఫోన్ దొరకగా బుధవారం సెల్‌ఫోన్ పొగొట్టుకున్న ప్రదీప్ అనే వ్యక్తికి అందజేశారు. దొరికిన సెల్ ఫోన్‌ను నిజాయతీగా అప్పగించిన గుండోజీ రాజ్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

- బోథ్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నౌషాద్ ఖాన్ దొరికిన సెల్‌ఫోన్‌ను సీఐ వెంకటేశ్వర రావుకు అందజేసి నిజాయతీ చాటుకున్నాడు. సెల్‌ఫోన్‌ను సీఐ బాధితుడు రమణయ్యకు అప్పగించారు. నిజాయతీని చాటుకున్న నౌషాద్ ఖాన్‌ను సీఐ, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు సన్మానం

బోథ్: ఇటీవల విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బోథ్ ఎస్సై ఎల్ ప్రవీణ్ కుమార్ శాలువాతో సన్మానించారు. నాగభూషణం పాఠశాలలో చదువుతున్న జాదవ్ తరుణ్, జాదవ్ శృతిలు నవోదయకు ఎంపిక కావడంతో వారిని అభినందించారు. ప్రధానోపాధ్యాయులు కిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని పోటీతత్వం అలవర్చుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ చైతన్య కుమారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు)లలో ఎక్స్‌టెన్షన్ లెక్చరర్ టైపిక్, పొలిటికల్ సైన్స్, కన్టెంట్ సబ్జెక్ట్ ఫర్ కాంపిటిట్ ఎగ్జామినేషన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆమెను అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ, అధ్యాపకులు పుట్ట లక్ష్మణ్, శిరీష, శ్రీలత, భార్గవి, ప్రీతం పాటిల్ పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను అరికట్టాలి'

ఆదిలాబాద్‌రూరల్: బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ అరికట్టాలని డీసీపీయూ సిబ్బంది ప్రేమ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలోని మక్కా మసీద్‌లో షర్ ఎన్జీవో ఆధ్వర్యంలో షర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్ వైజర్ కిరణ్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం జేజేబీ కోర్టు, చైల్డ్ లైన్, ఐసీపీఎస్, ఎన్జీవోలు పనిచేస్తున్నాయన్నారు. ఆపదలో ఉన్నవారు డయల్ 100, 181, 1098కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షుడు షేక్ అజర్ అలీ, అబ్దుల్ రషీద్, తౌఫీక్, మౌలానా ఫిరోజ్, ఇమామ్ సాహబ్, హఫీజ్, జుబైర్, సాహబ్, షేక్ అఫ్సాన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

బేల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా ధ్యాన మందిరం 4వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. యువత ఆధ్యాత్మిక బాటను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌రెడ్డి, ఠాక్రే గంభీర్, సతీష్‌పవార్, తేజ్‌రావు, గోడే విశాల్, సురేశ్ పాల్గొన్నారు.

'మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలి'

ఆదిలాబాద్‌రూరల్: త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలకు మంత్రి పదవి ఇచ్చినట్టే ఇచ్చి లాక్కొని అవమానించిందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ మాదిగలకు సముచిత స్థానం కల్పించాలన్నారు.

జంతుశాస్త్రంపై విస్తృత ఉపన్యాసం

ఆదిలాబాద్‌టౌన్: జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్లాసెంటా అండ్ టిప్స్ అనే అంశంపై ఉపన్యాసం నిర్వహించారు. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింగ్‌రావు విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.సంగీత, జంతుశాస్త్ర విభాగం హెచ్ఓడీ రాజ్‌కుమార్, లెక్చరర్లు అనిల్, రాజశేఖర్, వెంకటేశ్, సాలెహా, తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: సమాజ సేవకుడు, క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని ఆదిలాబాద్ క్రిష్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు హరికృష్ణ, పాస్టర్స్ అసోసిషన్ అధ్యక్షులు సురేశ్, రాకేశ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

'శిథిల' బడులు..!



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దొందరిగూడ గిరిజన ప్రాథమిక పాఠశాల (టీడబ్ల్యూపీఎస్). ఇక్కడ ఒకటి, రెండో తరగతుల వరకు ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. పాఠశాల స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని చిన్న పందిర్‌లొద్దీలో గిరిజన ప్రాథమిక పాఠశాల (టీడబ్ల్యూపీఎస్). ఇక్కడ ఎనిమిది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల గది అధ్వానంగా ఉండడంతో వారడంలో విద్యార్థులను కూర్చుబెట్టి ఉపాధ్యాయుడు బోధన కొనసాగిస్తున్నాడు.

- మరమ్మతుకు నోచుకోని భవనాలు
- భయం.. భయంగా చదువులు
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ఆదిలాబాద్‌రూరల్: భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో ఉండాలంటే ప్రాథమిక స్థాయి విద్య కీలకమైనది. అయితే చదువుతోనే సమాజంలో గుర్తింపు లభించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని, అందు కోసం వారి పిల్లలను చదివించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశాల్లో, సూచిస్తున్న విషయం తెలిసిందే. కానీ ప్రాథమిక స్థాయిలో గల టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో వారు విఫలమవుతున్నారు. పాఠశాల గదుల స్లాబ్‌లు ఊడిపోవడం, నేలపై ఫ్లోరింగ్ (పర్చిలు) లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలకు పంపేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

శిథిలావస్థ భవనాల్లోనే..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో 22 గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. 360 మంది విద్యార్థులు ఉన్నారు. చించుఘాట్ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో 26 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఉండగా.. 376 మంది విద్యార్థులు ఉన్నారు. ఎప్పుడో నిర్మించిన భవనాలు కావడంతో ప్రస్తుతం పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. స్లాబ్ పెచ్చులు ఉడిపోయి విద్యార్థులపై, ఉపాధ్యాయులపై పడుతున్నాయి. ఇదిలా ఉండగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ప్రభుత్వం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయడంతో అక్కడ మౌలిక వసతులు కలుగుతున్నాయి. కానీ గిరిజన ప్రాథమిక పాఠశాలలకు అంతంత మాత్రంగానే నిధులు మంజూరు చేయడంతో వసతులు అందుబాటులోకి రావడం లేదు.

చదువులకు దూరం..

గిరిజన ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలలకు పంపడానికి నిరాకరిస్తున్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. భవిష్యత్‌లో అన్నిరంగాల్లో స్థిరపడాలంటే ప్రాథమిక స్థాయి విద్యనే కీలకమైంది. అలాంటిది ప్రాథమిక స్థాయిలో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో ప్రధానంగా గిరిజన ఆదివాసీ పిల్లలు చదువులకు దూరమయ్యే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రాథమిక స్థాయిలో కనీస మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఊడిపడుతున్న స్లాబ్



తమ గ్రామంలోని గిరిజన బడి బిల్డింగ్ స్లాబ్ పడిపోతుంది. అయినప్పటికీ పిల్లలు అక్కడే ఉంటూ చదువుకుంటున్నారు. బిల్డింగ్ కరెక్ట్ లేకపోతే పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. అయిన్నప్పటికీ కొంత మంది పిల్లలు బడికి పోతున్నారు.

– సిడాం బాపురావ్, గ్రామ పటేల్, దొందరిగూడ.

విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది



ప్రస్తుతం తమ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. బిల్డింగ్ సక్రమంగా లేదు. స్లాబ్ ఉడి పడుతుంది. నేలపై పర్చిలు కూడా లేవు. ఇతర మార్గం లేక వారిని అక్కడే కుర్చోబెట్టి బోధన చేస్తున్నా. విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతుంది.

– అక్బార్ షావ్, ఉపాధ్యాయుడు, దొందరిగూడ, టీడబ్ల్యూపీఎస్

గిర్నూర్‌లో కార్డన్‌సెర్చ్



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామంలో బుధవారం బోథ్ సీఐ వెంకటేశ్వర రావు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహనంతో పాటు వెంట వాహన పత్రాలు ఉంచుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట బజార్‌హత్నూర్ ఎస్సై అప్పారావ్, బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉట్నూర్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీపార్లర్, మగ్గం వర్కర్, కుట్టు మిషన్, సెల్‌ఫోన్ రిపేరింగ్, హౌజ్ వైరింగ్ ఫొటోగ్రాఫీ, బైక్ మెకానిక్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఏప్రిల్ 5లోపు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని ఎస్‌బీఐ ఆర్‌సెటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99494 12159 సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల వేతనాల్లో కోత విధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల కిరణ్ అన్నారు. బుధవారం ఏఎన్ఎంలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందచేశారు. పూర్తి వేతనాలు చెల్లించని వారిపై చర్యలు తీకోవాలన్నారు. ఏఎన్ఎంలు పాఠశాల్లో, వసతి గృహాల్లో స్థానికంగా ఉండి విద్యార్థులకు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిత, శ్యాంసుందర్, జంగుబాయి, రాజేశ్ , తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర విజయవంతం చేద్దాం

ఇచ్చోడ: ధర్మసమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష కిలోమీటర్ల «మా భూమి రథయాత్ర»ను విజయవంతం చేయాలని డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డైట్ మైదానంలో నిర్వహించే సభతో రథయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ప్రజా సమస్యల కోసం 33 జిల్లాలో 612 మండలాలు 12 వేల గ్రామాల్లో మూడు సంవత్సరాల మూడు నెలల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యాధికార జేఏసీ నాయకులు వెంకటేశ్, నరేశ్, రాజేశ్వర్, శేఖర్, రమేశ్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎండలో జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల, నాగమల్యాల్, చిన్నబుగ్గారం, పీచర గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బోరుబావులు, చేతిపంపుల వద్ద నీరు వృథా కాకుండా చూడాలన్నారు. ఎంపీవో లక్ష్మణ్, ఏవో కృష్ణవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ పాల్గొన్నారు



బోరు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

బోథ్: రంగారెడ్డి కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా బుధవారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులు సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావు దేశ్ పాండే అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంగద్ కేంద్రె, రూపేందర్ సింగ్ ఠాకూర్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్ కుమార్, ధమ్మపాల్, జమీర్, ఎట్టం రాములు, వివేక్ సింగ్, గంగాసాగర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

దాహం.. దాహం



బోథ్: భూగర్భజలాలు అడుగంటడంతో బోథ్ మండల వ్యాప్తంగా నీటి ఎద్దడి నెలకొంది. దీంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. బోథ్ మండల కేంద్రంలోని పెద్ద వాగు వద్ద బుధవారం మధ్యాహ్నం పశువులు నీటిని తాగుతూ.. దాహర్తి తీర్చుకున్నాయి. కొద్ది రోజుల్లో పెద్దవాగు కూడా అడుగంటే పరిస్థితి నెలకొంది.

దినసంతకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దినసంత, వారసంత వేలం పాటను గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఈవో సంజీవ్‌రావు ప్రా రంభించారు. దినసంతకు రూ. 3 లక్షల, 25 వేలకు జొలే మంతోష్ దక్కించుకున్నాడు. వా రసంతకు రూ. 9 లక్షల, 60 వేలు మాత్రమే పా డడంతో వారసంత వేలంను వాయిదా వే ్ ిం నట్లు ఈవో సంజీవ్‌రావు తెలిపారు. వారసంత వేలంను గురువారం నిర్వహిస్తామన్నా రు. ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ నేవీకి ఎంపిక

బోథ్: బోథ్ మండల కేంద్రానికి చెందిన ప్రసుంజయ్, శివరాజ్‌లు ఇండియన్ నేవీకి ఎంపికయ్యారు. ఈనెల 25న విడుదల చేసిన అగ్నివీర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండల కేంద్రంలోని మైసమ్మ కాలనీకి చెందిన ఇద్దరు నేవీకి ఎంపిక కావడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ మాసం బుధవారం వారిని సత్కరించారు.



ప్రసుంజయ్



శివరాజ్

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో రూ. 3 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పులేటి రాజేశ్వర్ బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు మేకల నారాయణ, నగేశ్, లచ్చన పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని దేవపూర్‌లో రూ. 10 లక్షలతో నిర్మించే సీసీరోడ్డుకు బీజేపీ నాయకులు భూమిపూజ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అన్నిరంగాల్లో కుంటుపడ్డాయన్నారు. ఎంపీ నగేశ్ చొరవతో గ్రామంలో సీసీరోడ్డు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కిరణ్, శానం శ్రీనివాస్, పూలవేనా గణేష్, రేగుల మోహన్, నగేశ్, శాగంటి విష్ణు, బుచ్చిబాబు, అరవింద్ పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

- మహిళా రైతులకే వర్తింపు
- రేపటితో ముగియనున్న దరఖాస్తు గడువు

బోథ్: ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉప ప్రణాళిక పథకం కింద మహిళా రైతులకు వ్యవసాయ సామగ్రి ఇవ్వనున్నారు. మండలాల వారీగా వివిధ రకాల పరికరాలను ఇచ్చేందుకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవల వ్యవసాయ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024- 25లోనే ఈ పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తులు తీసుకోవడంతో పాటు లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారుల నుంచి సంబంధిత కంపెనీలకు డీడీలు కట్టించి సామగ్రిని పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మహిళా రైతులకే వీటిని ఇవ్వాలని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు వారం రోజుల గడువు మాత్రమే ఉంది. సమయం తక్కువగా ఉండటంతో వ్యవసాయాధికారులు కసరత్తు చేస్తున్నారు. బోథ్, సొనాల మండలాల్లో ఈనెల 28 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వ్యవసాయంలో ఉపయోగపడే పరికరాలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

మహిళా రైతులే అర్హులు..

ఈ పథకానికి కేవలం మహిళా రైతులు మాత్రమే అర్హులని ప్రభుత్వం పేర్కొంది. రాయితీ పొందేందుకు మహిళల పేరు మీద భూమి నమోదై ఉండాలి. దరఖాస్తు కోసం మహిళా రైతు పట్టపాస్ బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ (భాగస్వామికి /రైతుకి ట్రాక్టర్‌తో లాగబడే పనిముట్లకు మాత్రమే), సాయిల్ హెల్త్‌కార్డ్ తప్పనిసరి అని అధికారులు పేర్కొంటున్నారు. చిన్న సన్న కారు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, మిగితా మహిళా రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. కాగా ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తులను ఆయా క్లస్టర్లలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా వ్యవసాయ అధికారికి ఈనెల 28 లోపు ఇవ్వాలని బోథ్ వ్యవసాయాధికారి రవితేజ తెలిపారు.

బోథ్, సొనాల మండలాలకు కేటాయింపులు ఇలా..

ఎస్సీ	04
ఎస్టీ	03
జనరల్	16

వ్యవసాయ పరికరాలు..

- బ్యాటరీ స్ప్రేయర్స్ (జనరల్-4, ఎస్సీ- 1, ఎస్టీ- 1)
- పవర్ స్ప్రేయర్స్ (జనరల్- 4, ఎస్సీ-1, ఎస్టీ-1)
- రోటవేటర్ (జనరల్- 3, ఎస్సీ-1)
- సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ (జనరల్- 1)
- డిస్క్ హారో, కల్టివేటర్, ఎంబి నాగలి, కేజ్‌వీల్ (జనరల్ -3, ఎస్సీ- 1, ఎస్టీ- 1)
- మొక్కజొన్న షెల్లర్ (జనరల్- 1)

సంక్షిప్త వార్తలు

పారిశుధ్య కార్మికుడికి నివాళి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు గోంటిముక్కల గంగన్న పాలిటెక్నిక్ కాంపౌండ్‌ను ఆనుకుని ఉన్న మున్సిపల్ డంపింగ్‌యార్డ్‌లో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, కోప్పెపెల్లి గంగయ్య, మెరుగు చిరంజీవి, సురేశ్, గేడం పొచ్చిరాం, అశోక్, ఉషన్నలతో కలిసి కార్మికుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీడీసీ ఆధ్వర్యంలో ధరల నిర్ణయం

బోథ్: బోథ్ పట్టణంలో మొక్కజొన్న, జొన్నతో పాటు ఇతర పంటలను హార్వెస్టింగ్ చేసేందుకు వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ధరలు నిర్ణయించారు. మొక్కజొన్న క్వింటాలుకు రూ. 100, జొన్నలు క్వింటాలుకు రూ. 130, ఎకరానికి రూ. 3400గా నిర్ణయించారు.

ఎంపీ అనిల్‌కుమార్‌ను కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్‌ను యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రుపేష్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట బద్దం పోతారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద-టిలోని 11కేవీ, భోరజ్ టౌన్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కె.శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు. భోరజ్ మండలంలోని పుసాయి, నిరాల, ఫౌజ్‌పూర్, బాలపూర్, తర్నంతో పాటు భోరజ్ మండల కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నీటిఎద్దడి లేకుండా చూడాలి

నార్నూర్: గ్రామాల్లో నీటి ఎద్దటి లేకుండా చూడాలని ఎంపీడీవో జవహర్‌లాల్ అన్నారు. బుధవారం మండలంలోని చోర్గావ్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకులతో పాటు మిషన్ భగీరథ పైపులైన్ పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన ఇంకుడుగుంతలను పరిశీలించారు. నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు.

కాంగ్రెస్‌లో చేరిక

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన డీఆర్ఎస్ నాయకుడు చిలుకూరి నరేందర్, బీజేపీ నాయకుడు గంగాధర్‌లు బుధవారం బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

పెళ్లికి ఆర్థిక సాయం

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన మెస్రం మారుతి, పంచపుల బాయి దంపతుల కుమారుడు మెస్రం శేకు పెళ్లికి బుధవారం వాల్గొండ గ్రామస్తులు రూ. 23 వేల నగదు జమ చేసి అందించారు. పెళ్లి చేస్తున్న తల్లిదండ్రులకు ఆర్థిక భారం కావద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు తెలి పారు. గ్రామపటేల్ కినక మాని క్రాష్, గ్రామపెద్దలు కినక లచ్చు పటేల్, ఆత్రం జంగు, సంతోష్, మోతిరాం, ఆత్రం శేకు, మెస్రం సోమేశ్వర్, కినక రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న గ్రామస్తులు